# అమ్మ

మధ్యాహ్నం నుండీ తల నొప్పిగా ఉంది సుందరికి. ఆ పూట పని మనిషి రాలేదు. కానీ తల నొప్పికి కారణం అది కాదు.

చిట్టికి అన్నం తినిపించి, తనూ భోజనం కానిచ్చి, హాయిగా కునుకు తీస్తున్న వేళ, పల్లె నుండి వచ్చి దిగిన అత్తగారి రాకతో నిద్రాభంగం అయింది. విసుగుతోనే అయినా, అత్తగారిని పరామర్శించి, ఆవిడ కోసం అన్నం వండింది అప్పటికప్పుడు.

“ఈవిడ ఎప్పుడూ ఇంతే. ముందుగా ఒక ఉత్తరం వ్రాయించి పడేస్తే, ఏ వేళకి వచ్చినా భోజనం తయారుగా ఉంటుంది కదా! అలాంటి అలవాట్లు లేవు. ఎప్పుడూ ఇలాగే హఠాత్తుగా ఊడి పడుతుంది,” అని లోపలే గొణుక్కుంది సుందరి.

సాయంత్రం ఇల్లంతా కసువు చిమ్మి, ఎత్తి పెరట్లో ఉన్న తొట్టిలో వేయబోయింది. ప్రహరీ గోడ అవతల్నించి, పక్కఇంటి ఆమె తల మాత్రం కనుపించి పలకరించింది.

“మధ్యాహ్నం మీ ఇంటి ముందు రిక్షా ఆగినట్లుంది. ఎవరో చుట్టాలొచ్చారులాగుందే” అడిగింది పక్కింటి శాంతమ్మ.

“ఇంకెవరున్నారు లెండి మా ఇంటి కొచ్చే చుట్టాలు. మా అత్తగారే వచ్చి దిగారు.”

“ఆ మధ్యే వచ్చి వెళ్ళింది కదూ మూడు నెలల క్రితం?”

“ఊహు ఏదీ రెండు నెలలే అయింది క్రితం సారి వచ్చి వెళ్ళి. ఆవిడకేం లేండి, బుద్ధి పుట్టినప్పుడల్లా ప్రయాణం కట్టేస్తారు. దగ్గిరే కదా?”

తను మెల్లిగా మాట్లాడుతున్నాననీ, అవతల అత్తగారు నిద్రలో ఉన్నారనీ అనుకుంది సుందరి.

కానీ అప్పుడే నిద్ర లేచిన అత్తగారు, అంత క్రితమే ఇంట్లో అడుగు పెట్టిన భర్తా ఇద్దరికీ తన మాటలు వినిపించాయని ఆమెకు తెలీదు.

మహాలక్ష్మమ్మకి రఘురాం ఒక్కడే సంతానం. నిజానికావిడకి ఎప్పటికీ కొడుకుతోబాటు ఉండి పోవాలని ఉంటుంది మనసులో. అందులో వింత ఏమీ లేదు. కానీ కోడలికి తను ఇక్కడుండటం ఇష్టం లేదని ఆవిడ ఎప్పుడో తెలుసుకుంది. అందుకే పల్లెలో పాతమట్టి కొంపలో మకాం పెట్టి ఉంటోంది. అక్కడ ఆవిడకే భూములూ ఆస్తులూ లేవు. పంటలు పండి ధాన్యం ఇంటికి వచ్చే కాలంలో, తెలిసిన వారి ఇళ్ళలో ధాన్యం శుభ్ర పరచటం, పేరుసెనక్కాయలు ఒలిపించటం లాంటి పనులు దగ్గిరుండి చేయిస్తుంది. వేసవి కాలంలో ఊరగాయలు వేసే పని చేతి నిండుగా ఉంటుంది. చేసిన పనులకి వస్తురూపంగా వచ్చే ప్రతిఫలమే ఆమెకు జీవనాధారం. ఎప్పుడో తప్ప, తన అవసరాలకి కొడుకుని డబ్బు అడగదు. కొడుకునూ, అతని సంసారాన్ని చూడాలని ఎప్పుడు అనిపిస్తే అప్పుడు ప్రయాణం అయి వస్తుంది. కానీ ఉన్న వారం రోజులకే ముఖం మొత్తి తిరుగు ప్రయాణం కట్టటం ఎప్పుడూ జరిగేదే. కోడలితో ఎలాగయినా సర్దుకుపోవాలనీ, వాళ్ళతోనే ఉండిపోవాలనీ ఉంటుంది ఆవిడకి. కానీ ఆ కోరిక తీరే ఆశ మాత్రం ఏదీ కనిపించదు.

మనుషుల్లో ఎంత బాధనయినా దిగమింగుకుని, ఎటువంటి పరిస్థితుల్లో అయినా కోపావేశాలకి లోను కాకుండా, స్థిరచిత్తంతో ఉండగలవారు చాలా అరుదుగా ఉంటారు. ఇలాంటి వ్యక్తుల ‘మంచితనాని’కే ఒకోసారి ‘చేతకానితనం’ అనే లేబిల్ తగిలించటం జరుగుతూంటుంది. ఈ అరుదయిన తెగకి చెందినవాడు రఘురాం. సుందరికి, తన తల్లి అంటే ఎందుకు సరిపడదో అతనికి ఎంత ఆలోచించినా అర్థంకాదు. తను తప్ప మరో దిక్కులేని ఆవిడ పల్లెలో ఒంటరిగా ఉండిపోవటం అతనికే మాత్రం ఇష్టంలేదు. అలాగని ‘మా అమ్మ యిక్కడే ఉంటుంది’ అని భార్యతో గట్టిగా చెప్పటం అసలిష్టం లేదు. తనంతట తనే ఆమె, తన తల్లిని అభిమానించాలని, గౌరవించాలని అతని కోరిక. అందుకేం చేయాలో మాత్రం అతనికి అంతుపట్టని విషయం. ఎవరినీ ఏ విషయంలోనూ బలవంతం చేసి, ఏ పనీ చేయించలేమని అతని నమ్మకం.

సైకిల్ లోపలికి తెచ్చి స్టాండు వేస్తూ, పెరట్లోంచి వినవస్తున్న సుందరి మాటలు ఏం పట్టనట్లుగా, “ఎప్పుడమ్మా రావటం?” అని ఆప్యాయంగా తల్లిని పలకరించాడు రఘురాం.

తల్లి పక్కన మంచం మీద కూర్చుని మాట్లాడుతున్నాడు. “ఆరోగ్యం ఎలా ఉందమ్మా నీకు? ఈ మధ్య నీ నుంచి ఉత్తరాలు లేక ఎన్నాళ్ళయిందో!”

“నాకేంగుండ్రాయిలా ఉన్నాను. నువ్వేమిటో సన్నబడినట్లున్నావ్?”

“నీ కళ్ళకి నేనెప్పుడూ అలాగే కనిపిస్తానులే గానీ. నువ్వెన్ని గంటలకొచ్చావ్ ఊర్నించీ, భోజనం చేశావా?”

లోపల కాఫీ కలుపుతున్న సుందరికి ఈ సంభాషణతో తల నొప్పి మరింత ఎక్కువ అవుతోంది.

‘అమ్మో! మెత్తగా కనిపిస్తారు కానీ అన్ని ఆరాలు తీస్తారు ఈ పెద్దమనిషి. మధ్యాహ్నం ఇంటి కొచ్చిన అమ్మకి పెళ్ళాం భోజనం పెట్టిందా లేదా అని తెలుసుకుంటున్నారు. ముసలావిడా అంతే తనొక్కర్తే సవ్యంగా వంటచేసి పెట్టగలిగేటట్టు తన వంట తింటేనే కొడుకు ఆరోగ్యంగా ఉంటాడు అన్నట్లు మాట్లాడుతుంది’ అని విసుక్కుంది.


చిట్టి నిద్ర లేచింది. అవతల నాయనమ్మ స్వరం వినిపించింది. ఉత్సాహంగా పరిగెత్తుకొని ఇవతలికి వచ్చేసింది. “మా తల్లి బంగారుకొండ. అయిందా నిద్ర?” అంటూ ఆవిడ ఒళ్ళో కూచోబెట్టుకుంటే కొండెక్కినంత సంబరం ఆ పిల్లకి. “బడికెళ్ళలేదేమమ్మా” అని ఆవిడ అడగ్గానే “ఇవాళ సెలవుగా నానమ్మా” టక్కున జవాబు చెప్పింది చిట్టి, ‘అంత మాత్రం తెలియదా నీకు’ అనే ధోరణిలో.

కాఫీలు అయ్యాయి. కూరగాయల సంచీ పుచ్చుకుని తయారయాడు రఘురాం. అత్తగారు ఇంట్లో ఉంటే, సుందరి ఎలాంటి మూడ్‌లో ఉంటుందో అతనికి తెలియనిది కాదు. ఇలాంటివన్నీ మనసుకి పట్టించుకుని బాధపడటం అతను ఎప్పుడో మానేశాడు.

“కాకరకాయలు లేవా? వేయించేస్తావా రాత్రికి” అడిగాడు సుందర్ని.


‘కాకరకాయ వేపుడంటే వాళ్ళమ్మకిష్టం. అందుకే తెస్తాననటం. ఇంకా నన్నడగటం ఎందుకో’ అనుకుని, “ఏదో ఒకటి పట్టుకు రండి” అన్నది నిర్లిప్తంగా.

ఉన్నది మూడు గదుల ఇల్లు. ఇంట్లో ఉన్న



# మనసు

'వింధ్యవాసిని'



వాళ్ళంతా కలిసి కట్టుగా ఉంటే, ముగ్గురేమిటి అయిదుగురున్న కుటుంబమయినా సులభంగా ఇమడవచ్చు. కానీ ఉన్నవాళ్ళ మధ్య రహస్యాలు దాగటం అనేది వీలుకాని పరిస్థితి. ఇంట్లో ఎవరు ఎవర్తో ఏం మాట్లాడుతున్నా అందరికీ తెలుస్తుంది.

అత్తగారు తమతో ఉంటే ఖర్చు ఎక్కువ అనే కారణం ఒక వయిపు ఉన్నా ఆవిడ వల్ల తనకు భర్తతో ఏకాంతం దొరకదనే కోపం కూడా సుందరికి. తల్లీకొడుకులిద్దరూ కబుర్లలో పడ్డా రంటే తన్ని పరాయిదాన్ని చేసినట్లు ఉంటుంది ఆమెకు.

రఘురాంకి స్నేహితులు, బయట తిరుగుళ్ళు చాలా తక్కువ. సాయంత్రం ఆఫీసు నుండీ వచ్చా డంటే ఎప్పుడో తప్ప ఒక్కడే బయటికి వెళ్ళటం అంటూ ఉండదు. ఇంట్లో ఉన్నంత సేపూ కూతురితో ఆడుకుంటూనో భార్యతో కబుర్లాడు తూనో గడిపేస్తాడు. అలాంటివాడు, తల్లి రాగానే సగం టయిం అటు కేటాయించేసరికి, భరించలేక పోతుంది సుందరి. తనతో ఎదయినా చిన్న హాస్య మాడాలన్నా రహస్యంగానే.

నిజానికి మహాలక్ష్మమ్మగారుంటే చాలా పని తగ్గిపోతుంది సుందరికి. ఆవిడ నిద్ర పోయినప్పుడు తప్ప, మామూలుగా ఏదో ఒక పని చేయకుండా ఊరికే కూర్చోదు. కానీ ఆవిడ అంటే కలిగే చిరాకు వల్ల ఆమె చేసేది సహాయంలా అనిపిం చదు సుందరికి. 'వూరికే కూర్చోలేక అలవాటు కొద్దీ పని చేస్తుంటుంది' అనుకుంటుంది. తనంటే కోడలికి పడదని తెలిసినా మహాలక్ష్మమ్మకి సుందరి అంటే అభిమానమే. ఎపూట అయినా సుందరికి కాస్త నలత చేస్తే చాలు. మంచంలోంచి లేవని య్యదు. హాయిగా విశ్రాంతి తీసుకోనిచ్చి. అన్ని పనులూ చేసి పెడుతుంది.

రాత్రి భోజనాలు అయాయి. ముందర గదిలో వక్కె మంచం, పరుపు వేసి పెట్టాడు రఘురాం తల్లి కోసం. నాన్నమ్మతో మాట్లాడుతున్న నాన్నని తరిమేసింది చిట్టి, "నువ్వెళ్ళి పడుకో నాన్నా, నేను నాన్నమ్మతో కథ చెప్పుకోవాలి" అని.

సుందరి ఏం చేస్తోందో అని చూడబోయాడు రఘురాం. పళ్ళేలు, గ్లాసులు కడిగి సర్ది పెడుతున్న సుందరిని, "ఏమోయ్ ఇంకా నీపని అవలేదా?" అనడిగాడు.

"ఇదిగో అయిపోయింది. వస్తున్నానండీ. ఏం వక్కపొడి కావాలా?"

"ఊహూ కాదు. నువ్వేకావాలి" అని రహస్యంగా అంటూ, వెనుకగా వచ్చి, సుందరి భుజాల చుట్టూ చేతులు వేసాడు.

భర్త చేతులు విడిపించాలని ప్రయత్నిస్తూ, కళ్ళ-తలుపు వయిపు తిప్పి చూసింది. "చిట్టి ఏదీ?" అన్నది అనుమానంగా.

"వాళ్ళ నాన్నమ్మ దగ్గర చేరి కథ చెప్పించుకుంటోంది. ఇవాళ్టికి మన దగ్గిరకి రాదేమోలే" అన్నాడు రఘురాం, సుందరి ఇచ్చిన వక్కపొడి నోట్లో వేసుకుంటూ.

నాలుగేళ్ళ చిట్టి అమ్మా నాన్నలు స్నేహంగా వుంటే సహించదు.

ఇంట్లో ఉన్నది రెండే మంచాలు. ఒకటి అత్తగారికి వేస్తే మిగిలిన దానిమీద భర్తకి పరుపు వేసి సర్దింది సుందరి. కింద చాపమీద దుప్పటి పరచుకుంది తనకోసం.

చాపమీద నడుం వాల్చబోతున్న సుందర్ని, "ఇలా రావోయ్" అంటూ మంచం మీదికి లాగాడు రఘురాం.

"మా అమ్మ మనవణ్ణి ఎప్పుడిస్తావని అడుగుతోంది."

'ఆవిడికేం బాగా అడుగుతుంది' అనుకుంది సుందరి. పైకి మాత్రం ఏమీ అనలేదు.

"కొంపదీసి నాకు తెలీకుండా ఏ పిల్సో వాడుతున్నావా ఏమిటి? నిజంగా మరి నాకు ఒక బాబు వుంటే బాగుండు ననిపిస్తోందోయ్" చెవిలో గుసగుసగా అన్నాడు.

కథ అయిపోయింది కాబోలు. లోపలి కొచ్చేసింది చిట్టి.

'ఇట్లాంటి గడుగ్గాయి ఒకటుంటే 'ఇంక ఏ ఫామిలీ ప్లానింగూ అవసరం లేదు' అని గొణుక్కుంది సుందరి కూతుర్ని పక్కన వేసుకుని నిద్రకుపక్రమిస్తూ.

"బొత్తిగా ఓర్పులేని మనిషి. నిమిషాల మీద కోపం, విసుగూ వచ్చేస్తాయి" అనుకుంటూ లేచి వెళ్ళి లైట్లు ఆఫ్‌చేశాడు రఘురాం.

నాలుగు రోజులయ్యేసరికి తిరుగు ప్రయాణం కట్టేసింది మహాలక్ష్మమ్మ. ఎప్పుడూ జరిగేదే ఇది.

ఉదయం ఆఫీస్‌కి బయలు దేరుతున్న కొడుకుతో చెప్పింది. "ఇవాళ మధ్యాహ్నం ఊరికి పోతానురా" అని.

"అదేమిటమ్మా. అంత తొందర. అయినా అక్కడే మంత అర్జంటు పనులున్నాయని నాలుగు రోజులకే ప్రయాణం కట్టేస్తున్నావు?"

"లేదులేరా. ఏమిటో నాకు వూరికే కూచుంటే తోచదు. చేతినిండా పని వుంటేనే బావుంటుంది" అన్నది.

కాని అసలు కారణం ఇంకేదో వుండాలని, రఘురాంకి ఆవిడ ముఖం చూస్తేనే తెలుస్తోంది. కానీ ఎంత అడిగినా అసలు సంగతి బయట పెట్టదు ఆమె. తను ఎలా అయినా ఫరవాలేదు. కొడుకు సంసారం సవ్యంగా వుంటే చాలు అన్నదే ఆ తల్లి కోరిక.

"సరే నీఇష్టం. భోంచేసి వెళ్ళు" తన జేబు లోంచి ఇరవయి రూపాయలు తీసి ఆవిడ చేతిలో పెట్టాడు. అప్పుడు కొడుకు ముఖంలో కనిపించిన బాధ ముసలామె దృష్టిని దాటిపోలేదు.

*

సుందరికి కొంచెం నలతగా వుంటోంది. చాలా రోజులు రఘురాంకి చెప్పకుండా దాచింది. అతను తెలుసుకునేసరికి ఆమెకి మూడోనెల వచ్చింది.

"అమ్మా! నీకోరిక తీరబోతుంది. త్వరలో నీకు మనవడు పుడతాడు" అని తల్లికి ఉత్తరం వ్రాయాలనిపించింది రఘూరాంకి. కానీ విషయం తెలిస్తే ఆవిడ రాకుండా వుండదు. కోడలిని చూడాలని. 'ఎప్పుడొచ్చినా ఏదో మనస్పర్థతో వెళ్ళటమేకదా!' అనిపించి ఉత్తరం రాయటం మానేశాడు.

సుందరి అన్నయ్య కృష్ణమూర్తి, ఆఫీస్ పని మీద హైదరాబాద్‌కి వెళ్ళి వస్తూ, దారేకదా అని ఒక పూట కర్నూల్లో దిగేడు. సుందరిని చేసుకోక ముందే రఘురాంకి మంచి స్నేహితుడతను.

చిన్నతనంలోనే తల్లీ తండ్రి పోతే, బాధ్యతని తల మీద వేసుకున్నాడు కృష్ణమూర్తి. పెద్ద చెల్లి సుందరిని మిత్రుడు రఘురాం చేతిలో పెట్టి కొంత భారాన్ని దింపుకున్నాడు. ఇంట్లో ఇంకొక చెల్లి, తమ్ముడు వున్నారు. కృష్ణమూర్తి భార్య కూడ భర్తకు సహాయంగా ఉద్యోగం చేస్తోంది. కానీ వాళ్ల దురదృష్టం ఏమో పెళ్ళి అయి పదేళ్ళు అయినా సంతానం కలగలేదు. అందుకనే వాళ్ళకి సుందరి కూతురు చిట్టి అంటే ప్రాణం. హైదరాబాద్ నుండీ పాప కోసం బోలెడు బొమ్మలు, డ్రస్సు కొని తెచ్చాడు కృష్ణమూర్తి.

చెల్లాయీ, బావమరదులతో కబుర్ల కాలక్షేపం అయి పడుకోబోతూ, "చిట్టిని నా వెంట తీసికెళతాన్రా రఘూ. మీ అక్కయ్య తీసుకు రమ్మని మరీ మరీ చెప్పి పంపింది.

"సుందరికీ ఆరోగ్యం బాగులేనట్లుంది. కొన్నాళ్ళు అక్కడ విశ్రాంతి తీసుకుందువుగాని రమ్మంటే రానంటోంది. పోనీ చిట్టినయినా పంపితే, వాళ్ళమ్మకి రిలీఫ్ అవుతుందేమో!" అని అడిగాడు.

ఏదో మాట వరసకి అంటున్నాడులే అని రఘురాం ఏం జవాబు చెప్పలేదు. అతను నిజంగానే అడిగాడని సుందరి చెప్పేదాకా అతనికి అర్థం కాలేదు.

"మా అన్నయ్య చిట్టిని పంపమని అడిగితే పలుక్కుండా ఉండిపోయారేం?"

"అయితే నిజంగానే అడిగాడంటావా?"

"నిజంగాకాక, సరదాకి అబద్ధం ఆడేవారనుకున్నారా? పంపిస్తే ఏం! దానికెలాగూ సెలవలే కదా సెలవలు ఇచ్చినప్పట్నించీ ఇంట్లో నన్ను వేధిస్తోంది" అంటున్న సుందరి వంక నమ్మలేనట్లుగా చూశాడు రఘురాం.

"అది మనల్ని వదిలి ఉండగలదా అని...." సందేహంగా అన్నాడు.

"ఉండకేం. రాజుకీ, రమణకీ సెలవులే. ఇంట్లోనే ఉంటారు కదా చూసుకుంటారు. సాయంత్రం, రాత్రి మా వదినె చూసుకుంటుంది. దీనికి వాళ్ళ దగ్గర అలవాటేకదా! వెళ్ళినప్పుడల్లా అక్కడే ఉండిపోతానని పేచీ పెడుతూంటుంది."

'సుందరి ఇంత నమ్మకంగా ఎలా చెప్పగలుగుతోందో' అనుకున్నాడు రఘురాం. కానీ సుందరి ఏ విషయంలో అయినా ఒక నిర్ణయం చేసుకుంటే, దాన్ని కాదని, ఏర్పడే పరిస్థితులు భరించటం ఎంత

కష్టమో అతనికి తెలుసు.

"పోనీ ఎందుకొచ్చిన గొడవ. పిల్లలంతగా బెంగపెట్టుకుంటే, వాళ్ళ అన్నయ్యే తీసుకువచ్చి వదులుతాడు" అని సర్ది చెప్పుకున్నాడు తనకు తానే.

తెల్లవారి నిద్ర లేవగానే, "ఏమ్మా ఊరెళదాం వస్తావా?" అని కృష్ణమూర్తి అడిగితే, 'ఓ' అని బుద్ధిగా తయారయి అతని వెంట బయలుదేరింది చిట్టి.

తనకిష్టమయిన డ్రస్సులు అమ్మనడిగి బ్యాగులో పెట్టించుకుంది.

"మళ్ళీ ఎప్పుడొస్తావమ్మా" అనడిగాడు రఘురాం. రెండు చేతుల వేళ్ళు విప్పి చూపిస్తూ, "ఇన్ని రోజులకి" అని చెప్పింది చిట్టి. 'అమ్మో' అన్ని రోజులే అని అతను బెంగగా చూస్తుంటే, అరిందాలా బుగ్గ మీద ముద్దుపెట్టి, మామయ్య వేలు పట్టుకుని వెళ్ళిపోయింది, 'టాటా' చెబుతూ.

*

చిట్టి ఊరెళ్ళి వారం రోజులయింది. ముద్దు మాటలతో పొద్దు పోగొట్టే కూతురు ఇంట్లో లేకపోవటంతో రఘురాంకి పిచ్చెక్కినట్లుగా ఉంది. అయినా బయటికి చెప్పకుండా, సుందరి ఎలా ఫీలవుతూందో అని పరిశీలిస్తున్నాడు. తనకిష్టం లేదని తెలిసీ, పాపని ఊరు పంపిందని కాస్త కోపంగానే ఉంది అతనికి.

సుందరి ఆరోగ్యం కుదుటపడింది. డాక్టర్ వ్రాసి ఇచ్చిన మందులూ, టానిక్‌లూ వాడుతోంది. విశ్రాంతి తీసుకోవలసిన అవసరం కూడా తగ్గిపోయింది. అక్కడే మొదలయింది అసలు సమస్య.

చిట్టి అడ్డురావటం వల్ల ఇంట్లో సక్రమంగా చేయలేనని అనుకొనే పనులెన్నో కల్పించుకుని, గుర్తు చేసుకుని చేసుకుంటోంది ఇప్పుడు. అయినా ఉదయం భర్త ఆఫీసుకు వెళ్ళినప్పటి నుంచీ, సాయంత్రం అతను తిరిగి ఇల్లు చేరుకొనేదాకా అన్ని గంటలు ఎన్ని పనులు చేస్తే గడుస్తాయి.

ఏ పూటకాపూట సుందరి "ఊరెళ్ళి పాపను తీసుకురండని" అడుగుతుందేమోనని చూస్తున్నాడు రఘురాం. అప్పటికీ ఒకటి రెండుసార్లు అన్నాడు, "చిట్టి లేనందుకు, నీకు బోర్ కొట్టటం లేదూ?" అని.

"ఎందుకూ? అది పుట్టి నాలుగేళ్ళయింది. అంతకు ముందంతా ఎలా ఉన్నాం?" అని సమాధానం చెప్పిన సుందరిని ఏమనాలో అర్థం కాలేదు రఘురాంకి. అదే సమయంలో తమ పెళ్ళి అయిన కొత్తలో జరిగిన సంఘటన ఒకటి గుర్తొచ్చింది అతనికి. దీపావళి పండుగ కాబోలు, కృష్ణమూర్తి ఇద్దర్నీ ఆహ్వానించాడు. తనకు ఆఫీస్‌లో మూడు రోజులే సెలవు దొరికింది. సుందరి మరి కొన్ని రోజులుండి వొస్తుందని వాళ్ళు అడిగితే తను సరే నన్నాడు. కానీ ఆమె ససేమిరా అని తన వెంటే వచ్చేసింది.

"మిమ్మల్ని వదిలి నేనుండలేను లెండి" అంటున్న భార్యను, "మన పెళ్ళయి ఆరు నెలలేగా అయింది. ముందర ఎలా ఉన్నాం?" అని హాస్యమాడటం గుర్తొచ్చి నవ్వుకున్నాడు రఘురాం.

నిజానికి సుందరికీ లోలోపల వెలితిగానే ఉంది కూతురు లేకపోవటం. కానీ ఆ పిల్ల చేసే అల్లరి గుర్తొచ్చి, "పోనీ ఈ కొన్నాళ్ళు హాయిగా ఉన్నాను" అనుకుని సంతృప్తిపడుతోంది.

మధ్యాహ్నం ఒక్కర్తే కూచుని భోజనం చేస్తోంటే, 'చిట్టి ఎలా ఉందో అక్కడ. ఎన్ని మాటలు కథలు చెప్పి మరపిస్తేనో అది కాస్త అన్నం తినటం. అలాంటిదాన్ని ఎలా చూసుకుంటున్నారో' అనిపిస్తుంది.

రాత్రి మాటల మధ్యలో ఎప్పుడో నిద్రపోతాడు రఘురాం. ఒకో రోజు అర్ధరాత్రి అయినా నిద్ర పట్టదు సుందరికి. మెడ మీద చేతులూ, కడుపు మీద కాళ్ళు వేసి బిగించి పడుకునే కూతురు లేని

## లోకజ్ఞానం

1. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ–జనరల్‌గా ఇటీవల ఎన్నికైన వ్యక్తి ఎవరు? ఏ దేశస్థుడు?
2. నగరాలలో పెద్దపెద్ద భవనాలలో నేడు ఉపయోగిస్తున్న ఎలివేటర్ (లిఫ్ట్)ను కనిపెట్టినది ఎవరు? ఎప్పుడు?
3. సూరినామ్; ట్యూనిసియా, వెనిజులా, బెర్ముడా; బహ్రయిన్‌ల రాజధానీ నగరాలు ఏవి?
4. భౌతిక శాస్త్రంలో మొట్టమొదటి నోబెల్ బహుమతి పొందిన వ్యక్తి ఎవరు?
5. పురుగూ పుట్రా పోవడానికి డి.డి.టి. చల్లుతూ వుంటాము. అయితే డి. డి. టి. అంటే ఏమిటి?
6. ప్రపంచంలోకల్లా వెడల్పయిన జలపాతం ఏదో చెప్పగలరా?
7. భారతదేశం అంతరిక్ష కక్ష్యలోకి పంపిన మొదటి ఉపగ్రహం – ఆర్యభట, మూడవ ఉపగ్రహం రోహిణి. మరి రెండవ ఉపగ్రహం పేరేమిటో చెప్పగలరా?
8. ఇది అంతర్జాతీయ వయోవృద్ధుల సంవత్సరం, అయితే 1985వ సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి దేనిక్రింద పరిగణించనున్నది?
9. సాహిత్యంలో ప్రతి ఏడూ ఇచ్చే జ్ఞాన పీఠ అవార్డు 1979 సంవత్సరానికి ఎవరికి లభించింది?
10. అంధులకై బ్రెయిల్ లిపిని, అచ్చును కనిపెట్టిన వ్యక్తి పేరు బ్రెయిల్ అని మీకు తెలుసు–అయితే అతను ఏ దేశస్థుడు? ఏ సంవత్సరంలో ఆ లిపిని కనిపెట్టాడు?

[సమాధానాలు ఈ సంచికలోనే వున్నాయి. వెతికి మీ సమాధానాలతో సరిపోకాయేమో పోల్చి చూసుకోండి]

లోటుతో, అసహనంగా గడుపుతుంది. అయినా ఇవేమీ రఘురాంకి తెలియనివ్వకుండా గుంభనగా మనసులోనే పెట్టుకుంది.

ఒకసారి ఇద్దరూ షికారుగా పార్క్‌కి వెళ్ళారు. గేటులోనే అచ్చం చిట్టి లాగే కనిపిస్తున్న ఒక పాప తల్లిదండ్రులిద్దరి చేతులనీ పట్టుకుని గంతులు వేస్తూ ఎదురుగా వచ్చింది.

"మన చిట్టి లాగే ఉందికదూ ఆ పాప" మనసులో మెదిలిన భావాన్ని బయటపెట్టాడు రఘురాం. ఆ క్షణంలో సుందరి మనసులోని మాట అదే.

అంతటితో ఊరుకోలేదు రఘురాం. "ఏమిటో నువ్వెలా ఉన్నావోగానీ, నాకు మాత్రం బెంగగా ఉంది పాప లేకపోవటం. ఇంటికొచ్చానంటే కాళ్ళు చేతులు కట్టి పడేసినట్లుగా ఉంటోంది" అన్నాడు.

ఇక సంభాషణ ముందుకు సాగలేదు. సుందరి ముఖం నిర్లిప్తంగా మారిపోవటమూ, ఆమె లోలోపల ఏదో బాధపడుతున్నట్లుండటమూ గమనించాడు రఘురాం.

"ఏమిటలా అయిపోయావ్?" అడిగాడు.

"కొంచం తల నొప్పిగా ఉంది!"

"పోనీ ఇంటికి వెళ్ళిపోదామా?" తల వూపింది. ఇంటి దారి పట్టారిద్దరూ.

*

"ఇదిగో మీ అన్నయ్య ఉత్తరం వ్రాసాడు" అంటూ సుందరికి అందించాడు రఘురాం.

"ఏమని రాసారు? చిట్టి ఎలా ఉందట?"

"దానికేం బాగానే ఉందట. ఇంకా కొన్నాళ్ళుంటుందిలే ఇక్కడే అని రాసాడు."

కాఫీ తాగి పేపర్ చూస్తూ కూర్చున్నాడు రఘురాం.

"చిట్టి చూడండీ, మనకోసం అసలు ఏమీ బెంగ పెట్టుకోకుండా వుండిపోయింది అక్కడ. ఇది చదివితే మీకేమీ అనిపించలేదూ?" అడిగింది సుందరి వచ్చి భర్త పక్కనే వున్న స్టూలు మీద కూర్చుంటూ.

"అనిపించేందు కేముంది? బాగా వుండాలనీ, వుండగలుగుతుందనే పంపించేంగా?"

"అదికాదండీ ఒక్కసారయినా, అమ్మా నాన్నా అని తలచుకోకుండా నిబ్బరంగా వుండగలిగిందంటే నమ్మకం కలగకుండా వుంది నాకు. అయినా అన్నయ్య వూరికే ఎందుకు రాస్తాడులే.... ఏమిటో పిల్లల కోసమని మనం ఎన్నో వదులుకుంటాము. ఎప్పుడూ వాళ్ళు సంతోషంగా వుంటే చాలు అనుకుంటాము. ఏ కాస్త కాలునొప్పో, కడుపునొప్పో వచ్చినా, తల్లడిల్లిపోయి, తిండీ నిద్రా మానేసి కనిపెట్టుకుని వుంటాం. ఇదేమీ అర్థం చేసుకోరు కాబోలు వాళ్ళు...."

పేపర్ పక్కన పడేసి, సుందరి కళ్ళలోకి విచితంగా చూస్తూ కూర్చున్నాడు రఘురాం.

"ఏమిటిలా మాట్లాతోందివాళ అని చూస్తున్నారుకదూ? అవునండీ నేనేం బండరాయిని కాదుగా! కాకపోతే కాస్త గుంభనగా వుంటాను అంతే" అంటున్న సుందరి కళ్ళలో నీళ్ళు తిరగటం అతను గమనించాడు.

"అరెరే నేనేమన్నానోయ్. అంతగా బాధ పడుతున్నావ్?" అంటూ ఆమె భుజాలు పట్టి దగ్గరికి తీసుకున్నాడు.

"మీతో చెప్పలేదు గానీ, నా మనసేం బాగా లేదు. భోజనం సహించదు. నిద్రరాదు. ఏ పని


భారతదేశపు అతిచిన్న ప్రెషర్ కుక్కర్

365 రోజులవరకు విడిభాగాలను ఉచితంగా యిచ్చే ఏ నిబంధనలేని గ్యారంటీతో

బులెట్ ప్రెషర్ కుక్కర్

- 14 సైజులలో రెండు వేరువేరు మోడల్‌లో భారత దేశపు ఏకైక కుక్కర్
- భారతదేశపు అతిచిన్న 2 లీటర్ల ప్రెషర్ కుక్కర్
- రూ. 1/- మాత్రమే ధరగల లేటెస్ట్ సేఫ్టీ వాల్వ్ పరికరముగల భారతదేశపు ఏకైక కుక్కర్
- 365 రోజులవరకు విడిభాగాలను ఉచితంగా యిచ్చే ఏ నిబంధనలేని గ్యారంటీగల భారతదేశపు ఏకైక కుక్కర్




5 సం॥ల గ్యారంటీ

ఎలైట్ ఏజన్సీస్ 7. 8. 9. జగదీశ్ మార్కెట్, ఆబిడ్స్, హైద్రాబాద్-1 ఫోన్ : 223148

Service Centre for Krishna, East Godavari, West Godavari Districts :—
M/s SOLAR ENTERPRISES
Prakasham Road, Governorpet, Vijayawada

Service Centre for Guntur & Ongole Districts :—
M/s SIVA COMMERCIAL CORPORATION
Station Road, Guntur — Ph : 20856

చేస్తున్నా చిట్టితల్లే గుర్తొస్తుంది. అది వెళ్ళి పది రోజులయినా కాలేదు. వెళ్ళి తీసుకు రండి అంటే మీకు కోపం వస్తుందేమోనని చెప్పలేదు'' కళ్ళ నీళ్ళు ఆపుకుంటూ భర్తఒడిలో ముఖాన్ని దాచుకుని అంది సుందరి.

''ఈ అమ్మాయి తత్వం ఇన్నేళ్ళయినా పూర్తిగా అర్థంగాదు నాకు ఏమిటో'' అనుకున్నాడు రఘురాం.

సాయంత్రం బజారుకు వెళ్ళి కూరగాయలు తీసుకొచ్చాడు. అప్పటినుంచీ అతను కాస్త సీరియస్‌గా ఉండటం గమనించింది సుందరి. తను ఏం మాట్లాడినా 'ఊ' 'అహ' అనే సమాధానం తప్పిస్తే అతను ఎందుకో ముభావంగా ఉన్నాడు.

రాత్రి భోజనాలు అయాయి. ''ఏమండీ మరి ఊరికెప్పుడు వెడతారు?'' అడిగింది సుందరి భర్తకి తాంబూలం అందిస్తూ. ''ఎల్లుండి ఆదివారమేగా? రేపు రాత్రి బయలుదేరతాలే.... పోనీ నువ్వూ వస్తావా ఏమిటి?''

''వద్దు. నే వెళితే వెంటనే రానివ్వరు. మీకు ఇబ్బంది. మీరే వెళ్ళిరండి.''

''లైటు ఆర్పెయ్యనా'' బెడ్ లయిటు వెలిగింది.

గుండెల మీద చేతులుంచుకుని కప్పు వయిపు చూస్తూ పడుకుని ఉన్న రఘురాం దగ్గరికి జరుగుతూ అడిగింది సుందరి. ''ఏమండీ ఎందుకో అదోలా ఉన్నారు, నాకు చెప్పరూ?'' అని.

''మరేం లేదు....మన పాపకి నాలుగేళ్ళు. నాలుగేళ్ళు పెంచిన ప్రేమతోనే కన్నకూతురి వయిన యింత మమకారం పెంచుకున్నాం మనము. అది మనల్ని వదిలి హాయిగా ఉండగలిగింది. మనం మాత్రం దానికోసం బెంగపెట్టుకుని బాధపడుతున్నాము....

"మరి మా అమ్మ చిన్నప్పుడే నాన్నపోతే తన ఆశలన్నీ నా మీద పెట్టుకుని ఇరవయి రెండేళ్ళ వయసు వచ్చేదాకా నన్ను తన సర్వస్వం ధారబోసి పెంచుకుంది. ఇప్పుడు... ఈ వయసులో ఒంటరిగా ఆ పల్లెలో నాకు దూరంగా ఎలా ఉండగలుగుతూందో...ఎంత బాధ పెట్టుకుందో మనసులో...అనిపించి ఆలోచిస్తున్నాను.''

నిజానికి అతను సుందరిని బాధపెట్టాలని ఈ మాటలు అనలేదు. ఏవో మనసులో కదులుతున్న ఆలోచనలని, ఆమె ఏమిటలా ఉన్నారు అని అడిగితే, అనాలోచితంగా బయట పెట్టాడు.

సుందరి గుండెలకి ఎక్కడో తగలరాని చోట చెర్నాకోలపెట్టి కొట్టినట్లయింది. ఇదేమీ గమనించని రఘురాం అటు వయిపు తిరిగి కళ్ళు మూసుకున్నాడు.

సుందరికి తన తల్లిదండ్రులెలా ఉంటారో గుర్తు లేదు. తన భర్తకీ, అత్తగారికీ మధ్య ఉన్న బాంధవ్యాన్ని గురించి ఆమె ఎప్పుడూ పెద్దగా ఆలోచించ లేదు.

ఇప్పుడు ఆమె హృదయంలో ఏదో తెలియని కవాట ద్వారం తెరుచుకున్నట్లయింది. తమ పెళ్ళి అయి ఇక్కడ కాపురం పెట్టినప్పట్నుంచీ అత్తగారి రాకపోకలు, ఆమె తమ మీద చూపించే అభిమానం, తను ఆవిడతో ప్రవర్తించే తీరు అన్నీ గుర్తొచ్చి కలవరపెడుతున్నాయి. అత్తాకోడళ్ళు అంటే ఉత్తర దక్షిణ ధృవాలు అనే భావం ఎలాగో ఎప్పుడో నాటుకుంది తన మనసులో.

అర్ధరాత్రి అయింది. దాహం అయి మెలకువ వచ్చింది రఘురాంకి. పక్కన కూర్చుని తన ముఖంలోకి చూస్తున్న సుందరి కన్పించి ఉలిక్కిపడ్డాడు. ''ఏమిటిది? ఒట్టిమనిషివి కూడా కాదు. ఇలా విశ్రాంతి లేకుండా కూచుంటే ఆరోగ్యం పాడవదూ?'' అని మందలించి పడుకోబెట్టాడు.

''ఏమండీ నన్ను క్షమించరూ?''

అయోమయంగా ఉంది రఘురాంకి.

''నన్నేమీ అడగొద్దు. క్షమించానని చెప్పండి ముందు'' అంటూ అతని చేతినితీసి తన కళ్ళ మీద ఆనించుకుంది.

''రేపు అత్తయ్యకి జాబు రాయరూ? ఇక్కడికొచ్చెయ్యమని'' సుందరి మాటలు అర్థం కావటం లేదు అతనికి.

''ఏమిటండీ పలకరు. మీరు రాస్తారా నన్ను రాయమన్నారా? అవునూ....మరి ఆవిడకీ త్వరలో మనుమడు పుడతాడని రాయటం మరువరు కదూ?'' కళ్ళు మూసుకుని ఏదో లోకంలో ఉన్నదానిలా మాట్లాడుతోంది సుందరి.

''చిత్రమయిన మనిషి. ఈమె మనసు ఏ నిమిషం ఎలా మారుతుందో ఎప్పుడూ నా ఊహకి అందదు'' అనుకుంటూ కళ్ళు మూసుకున్న రఘురాం మరు నిమిషమే నిద్రలోకి జారుకున్నాడు. □

ఎ. చిన్నమ్మ



ఉత్తర మద్రాసు ఆర్ట్స్ కాలేజీలో, మొదటి సంవత్సరం బి.ఎస్సి. (భౌతిక శాస్త్రం) చదువుతున్న ఎ. చిన్నమ్మ 'స్వతహాగా పోటీలలో పాల్గొనడం పట్ల ఉత్సాహమూ, ఆసక్తి ఎక్కువగా కనబరుస్తుంటాను' అని అంటారు. ఆ విధంగానే ఆమె స్థానిక కె. టి. సి. టి. బాలికోన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడు వ్యాసరచన పోటీలలోను, వక్తృత్వపు పోటీలలోను పాల్గొని అనేక మార్లు మొదటి బహుమతులు తెచ్చుకున్నారు. మద్రాసులోని ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'కళాసాగర్' ప్రతి ఏడూ నిర్వహించే వ్యాసరచన పోటీలో–'ఈ నాటి యువతరంలో అధిక శాతం మానసిక బలహీనతలకు గురి కావడానికిగల కారణాలు ఏమిటి?' అనే అంశంపై ఉత్తమమైన వ్యాసం రాసి ఈ సంవత్సరపు లిటరరీ అవార్డును పొందారు చిన్నమ్మ.